విగ్రహారాధనము

By

K. VEERESALINGAM

6 ~~8~~ - 1 - 1897

విగ్రహారాధనము

ఓ ప్రియసహోదరులారా!

మనుష్యుఁ డనుభవింపఁ దగిన సమస్తానందములలోను, పొందఁ దగిన సమస్తాభివృద్ధులలోను, ఆత్మానందాభివృద్ధులు మహోత్కృష్టములయిన వని వివేకుల కందఱికిని తెలిసిన విషయమేకదా? ఈ యానందాభివృద్ధులు సత్యమయిన యీశ్వరారాధనమువలనను, సత్యమయిన జ్ఞానమువలనను కలుగు ననియు కొంచెమాలోచించి చూచువారి కెల్లను ఇంచుమించుగా తెలిసెడి విషయమే. సత్యమయిన జ్ఞానమును వ్యాపింపఁజేసి పరిశుద్ధమయిన యీశ్వరారాధనమును వర్ధిల్లఁ జేయవలెనన్న పక్షమున, మనుష్యబుద్ధి కల్పితములయి మతమునం దనావశ్యకముగా ప్రవేశించి చిరకాలమునుండి యీశ్వరైకార్హమయినపూజ నక్రమముగా ననుభవించుచున్న యసత్యదేవతల యొక్కయు కుత్సితప్రతిమల యొక్కయు ఆరాధనమును మూలముట్టుగ తొలగించుటకయి ప్రబల ప్రయత్నము చేయవలయును. ఇట్టి ప్రయత్నమువలనఁ గొందఱికి చిత్తశాంతి పోయి మనస్తాపము కలుగుట యనివార్యమే యయినను, ఒరులమనస్సునకు నొప్పి కలుగఁ జేయుట నాకెంత యిష్టము లేకపోయినను మానవకోటియొక్క నిత్యానందమునకు భంగము కలుగుచున్నప్పుడును సర్వకారుణ్యుఁ డయిన పరమేశ్వరునికి చెందవలసిన భక్తికైంకర్యాదులు తుచ్ఛములయిన విగ్రహములపాలయి మౌఢ్యముచేత నీశ్వరమహిమ మఱుఁగుపఱుపఁబడుచున్నప్పుడును మాత్రము నాశక్తియుక్తుల నెల్లను వినియోగపఱిచి, ఆనందసస్యము పెరుఁగక బీడుపడియున్న యస్మద్దేశీయుల

హృదయ క్షేత్రములయం దీశ్వరరాజ్యబీజమును స్థాపించుటకయి పాటుపడక, జడములయిన ప్రతిమలయందును ప్రతిమలను నమ్మి కొలుచువారియందును దాక్షిణ్యము వహించి నే నూరకుండఁజాలను. ప్రతిమార్చనము తగదన్న దోషమునకయి మూఢులును, జనులను మౌఢ్యమునం దుంచి వారి మౌఢ్యమువలననే కుటుంబభరణము చేసికొని లాభముపొంద నలవాటుపడిన స్వప్రయోజనధురంధరులును నన్ను నిష్కారణముగా నాస్తికుఁ డనియు బౌద్ధుఁడనియు నిందించినను నిందింపనిండు. పామరులయొక్కయు స్వార్థపరులయొక్కయు దూషణలను, ప్రతిబంధములను పాటిగాఁ బట్టక సత్యము నే యవలంబించెడు బుద్ధిని, వేయివిఘ్నములు వచ్చినను వెనుకతీయక నిశ్శంకముగా సత్యమును లోకోపకారార్థమయి బోధించునట్టి ధైర్యస్థైర్యాదులను, పరమకృపాళుఁ డయిన యీశ్వరుఁడు నాకు ప్రసాదించునుగాక!

సకల జగత్కర్తయైన యీశ్వరుఁ డొక్కఁడనియు, అతఁడు నిరాకారుఁ డగుటచేత బాహ్యేంద్రియములకు గోచరించువాఁడు కాఁడనియు, కేవలమానసైకవేద్యుఁ డనియు, సర్వమతములవారును నైకకంఠ్యముతో నంగీకరించిన రాద్ధాంతాంశమే గనుక దానిని స్థాపించుటకయి నేనిక్కడ యుక్తులు చెప్పి గ్రంథ బాహుళ్యము చేయవలసినపని లేదు. ముండకోపనిషత్తునందు "న చక్షుషా గృహ్యతే నాపి వాచా నాన్యైర్దేవై స్తపసా కర్మణా వా। జ్ఞానప్రసాదేన విశుద్ధసత్త్వః తతస్తుతం పశ్యతే నిష్కలం ధ్యాయమానః" అని యీశ్వరుఁడు నేత్రముచేతఁగాని, వాక్కుచేతఁగాని, ఇతరేంద్రియములచేతఁగాని, తపస్సుచేతఁగాని, కర్మచేతఁగాని గ్రహింపఁబడఁడనియు, మనశ్శుద్ధి కలవాఁడు ధ్యానముచేసి యీశ్వరుఁడు ప్రసాదించిన జ్ఞానముచేతనే యాతనిని తెలిసికొనుననియు, చెప్పబడియున్నది. ఈశ్వరుని

ధ్యానమార్గముననే జ్ఞాననేత్రముచేతఁ జూడవలెనని యుపదేశించుటయేకాక వేదము బహుస్థలములయందు దేవుఁడు నిరాకారుఁ డని తెలిసికొని యారాధించువారికే కాని నిజమయిన యానందము లేదనియు ఘోషించుచున్నది. శ్వేతాశ్వతరోపనిషత్తునందు "తతోయదుత్తరతరం తదరూప మనామయం య ఏతద్విదు రమృతా స్తేభవన్త్యథేతరే దుఃఖమేవాపి యాన్తి" అని యీశ్వరుఁ డుత్కృష్టపదార్థములలో నెల్ల నుత్కృష్టుఁడనియు నిరాకారుఁడనియు నిరామయుఁడనియు నెవ్వ రెఱుఁగుదురో వారు నిత్యసుఖిత్వమును పొందుదురు, తదితరులు దుఃఖమునే పొందుదురనియు, వివరింపఁబడి యున్నది. అంతేకాక యీశ్వరు ననేకముగాఁ జూచువారు మోక్షపదవి నందక చెడుదురనియు, ప్రకృతినిగాని సృష్టిపదార్థమునుగాని యుపాసించువా రంధకారమునఁ బడుదురనియు కూడ వేదమే మొఱ యిడుచున్నది. కఠోపనిషత్తునందు "మనసై వేదమాప్తవ్యం నేహనానాస్తికించన। మృత్యోస్సమృత్యుం గచ్ఛతి య ఇహనానేవ పశ్యతి" యని మనస్సుచేత మాత్రము బ్రహ్మము నందఁదగు ననియు అక్కడ ననేకమనునది లేదు కాఁబట్టి యిక్కడ ననేకమునుగాఁ జూచువాఁడు మృత్యువునుండి మృత్యువునకుఁ బోవు ననియు, మఱియు వాజసనేయోపనిషత్తునందు "అన్ధన్తమః ప్రవిశన్తి యేసంభూతి ముపాసతే, తతోభూయ ఇవ తే తమో య ఉ సంభూత్యాగ్ంరతాః" అని ప్రకృతి నుపాసించువా రంధకారమునం బ్రవేశింతు రనియు సృష్టిపదార్థముల నుపాసించు వా రంతకంటెను హీనమయినయంధకారమునఁ బడుదురనియు, స్పష్టపఱుపఁబడి యున్నది. ఈశ్వరుఁడు మానసైకవేద్యుఁ డనియు, ప్రకృతినిగాని విగ్రహాదులనుగాని యుపాసించుట దూష్య మనియు, చూపుటకయి వేదమునుండి యిటువంటి ప్రమాణశతముల నుదా

హరింపవచ్చునుగాని గ్రంథవిస్తారమువలన నధికప్రయోజనము లేదు. కాఁబట్టి యింతటితో విరమించెదను. హిందువు లందఱిచేతను సర్వోత్కృష్టప్రమాణముగా నంగీకరింపఁబడుచున్న వేదమే యీ ప్రకారముగా ప్రతిమార్చనము వలదని బహుముఖముల ఘోష మిడుచుండగా దానిని విశ్వసింపక, నిన్న మొన్న పుట్టిన పురాణముల యందు విగ్రహారాధన విషయమయి వేదవిరుద్ధముగా జొప్పింపఁ బడిన వాక్యములను మనవా రెట్లు పరమప్రమాణములనుగా స్వీక రింపఁ గలుగుచున్నారో నేనూహింపఁజాలకున్నాను. శబ్దప్రమాణము లలో నెల్ల నధమము లయిన యీపురాణములు సహిత మజ్ఞులవిష యమున విగ్రహారాధనమును శ్లాఘించుచు వచ్చినను, ప్రాజ్ఞుల విషయమయి పలుకవలసిన వచ్చినప్పుడు విగ్రహారాధనము నింద్యమని బొత్తిగా చూపకున్నవి కావు. అయినను మనదేశము చేసికొన్న పాప మేమో కాని చిరకాలమునుండి మనవారికి పురాణములయందలి యధ ర్మములవలె నందలి సద్ధర్మము లంతగా రుచింప కున్నవి. పురాణ ములయందు విగ్రహారాధనము నిరసింపఁ బడలేదని నమ్మియుండెడి విజ్ఞుల యుపయోగార్థము వరుసగా శైవవైష్ణవ పురాణములనుండి రెండుమూడు వచనములను మాత్ర మెత్తిచూపుచున్నాను. స్కాంద పురాణమునందు "ఆత్మసంస్థం శివం త్యక్త్వా బహిస్థం యజతే శివం । హస్తస్థం పిండముత్సృజ్య లిహేత్కూర్పరమాత్మనః॥ శివమాత్మని పశ్యన్తి ప్రతిమాసు న యోగినః। అజ్ఞానాం భావనార్థాయ ప్రతిమాః పరికల్పి తాః॥" అని తనలోనుండు నీశ్వరుని విడిచిపెట్టి బయటనుండు శివుని పూజించుట యఱచేతిలోని యన్నమును పాఱవైచి మోచేతిని నాకు టయే యనియు, యోగు లీశ్వరుని తమలోఁ జూతురుగాని ప్రతిమల యందుఁ గాదనియు, తెలివితక్కువవారి భావనానిమిత్తమయి ప్రతిములు

కల్పింపఁబడిన వనియు చెప్పఁబడియున్నది. ఈలాగుననే శ్రీమద్భాగవతతృతీయస్కంధమునందును "శ్లో॥ అహం సర్వేషు భూతేషు భూతాత్మావస్థిత స్సదా। తమవజ్ఞాయ మాం మర్త్యః కురుతేర్చావిడంబనమ్॥ యో మాం సర్వేషు భూతేషు సంత మాత్మాన మీశ్వరమ్। హిత్వార్చాం భజతే మౌఢ్యా ద్భస్మ న్యేవ జుహోతి సః॥" అని నేను (ఈశ్వరుఁడు) సదా సకలభూతములయందును ఆత్మస్వరూపుఁడనయి యుండఁగా అటువంటినన్నవమానపఱచుటకయి మనుష్యుఁడర్చ యను పరిహాసమును జేయుచున్నాఁ డనియు సర్వభూతములయందును ఆత్మస్వరూపుఁడనుగానున్న యీశ్వరుని నన్ను విడిచి మూఢత్వముచేత నెవ్వఁ డర్చను చేయుచున్నాఁడో వాఁడు బూడిదలో హోమము చేయువాఁడే యనియు ప్రతిపాదింపఁబడియున్నది. ఈపురాణములనుబట్టి విచారించినను విగ్రహములనుపాసించువారు బుద్ధిహీనులనియు, బుద్ధిహీనులనిమిత్తమే ప్రతిమలు కల్పింపఁబడినవనియు నేతేటపడుచున్నది. "ప్రతిమా స్వల్పబుద్ధీనాం। సర్వత్ర విదితాత్మనాం" అని దేవుఁడు బుద్ధిహీనులకు ప్రతిమలయందును, తెలిసినవారికిసర్వత్రనుండు నన్నయు తెరగీతా వచనమువలనను, "కాష్ఠలోష్టేషుమూఢానాం యుక్తస్యాత్మని దేవతా" యని దేవుఁడు మూఢులకు కాష్ఠలోష్టములయందును వివేకులకు మనస్సునందును నుండు నన్నప్రమాణాంతరమువలనను, కేవలమూఢులకే గాని జ్ఞానలేశము కలవారికి బింబోపాసనము తగదని కరతలామలక మగుచున్నది. చెప్పినను మూఢులు గ్రహింపలే రని భ్రమించి వా రీశ్వరజ్ఞానము లేక కేవల నాస్తికులయి చెడిపోవుటకంటె ప్రతిమలను పూజించుటవలన నయినను వారికొకప్పుడు కాకపోయిన నొకప్పుడయిన సర్వమును సృజించి పాలించెడు ప్రభు వొకఁ డున్నాఁ డన్నజ్ఞానము కొంచెము పుట్టవచ్చుననని యెంచి

మనపూర్వులు దీర్ఘాలోచన లేక మూఢులనిమిత్తమయి ప్రతిమలను కొంతకాలముక్రిందట సచ్చింతతోనే కల్పించి యుందురు. ఈప్రతిమలందుచేత మొట్టమొదట మూఢశిరోమణులనిమిత్తమే యుద్దేశింపఁబడినను, ఏమి కాలధర్మదోషముననోకాని మనదేశమునం దిప్పుడు విగ్రహములు పామరుల గుడిసెలయందుమాత్రమేకాక పండితు లనఁబడెడువారిపవిత్రగృహములయందుకూడ నిరాటంకముగా ప్రవేశించి, యీశ్వరుని సర్వాధికారమును తామేవహించి సర్వత్రపూజ నొందుచు, జనులను విగ్రహారాధనమే సర్వోత్కృష్టమని భావించి వాదించునంతటిదుస్థితికిఁ దెచ్చినవి. ఓహో! స్వప్రయోజనపరులై విగ్రహారాధనమే సర్వార్థదాయక మని బోధించెడి పండితవేషధారుల యనుగ్రహమువలన, పూర్వకాలమునందు పరమేశ్వరుని యేకదివ్యాలయముగా నుండి పరిశుద్ధేశ్వరోపాసనముచేత సుప్రసిద్ధ మయియుండిన యీభరతఖండమున కిప్పు డెంత దుర్గతి పట్టినది! జ్ఞానానందసంధాయకుఁ డయిన యేకేశ్వరుని యుత్తమారాధనమును విడిచిపెట్టి జడము లయిన లెక్కలేని శిలాలోహవిగ్రహములకాళ్ళకు మ్రొక్కవలసివచ్చిన మనదేశపు ప్రస్తుతదుర్దశను తలఁచుకోఁగా నాదేహ మిప్పుడు కంప మెత్తుచున్నది. గౌరవస్థానములయిన పీఠములమీఁద నెక్కి, ఈశ్వరునకును మనుష్యులకును మధ్య నిలిచి యీశ్వరైకార్హమయిన పూజాసత్కారమును తా మయోగ్యముగా పొందుచున్న యీవిగ్రహములు మరల తమ కుచిత మయినస్థితిని బొంది బొమ్మరిండ్లలో బిడ్డలవినోదమునకే యుపయోగపడుచుండఁగా చూచి సంతోషించెడిభాగ్యము భగవత్కటాక్షమువలన మనదేశయిన కత్యంతశీఘ్రకాలములోనే కలుగునుగాక!

మన మిఁక మూఢులకయినను విగ్రహారాధనమువలన ప్రయోజనలేశము కలుగునా యున్న యంశమును, విగ్రహారాధనమువలనఁ

గలుగుచున్నయనర్థములను, ప్రతిమార్చనము మానుటవలన సంభవించెడి లాభములను, కొంచెము విమర్శింతము. ప్రపంచములోని సమస్తదేశములలోను సమస్త మతములలోను ఒక్క హిందూదేశమునందును దానిలోపల ఒక్క హిందూమతమునందును మాత్రము విగ్రహారాధనము కొంతకాలమునుండి పారంపర్యముగా వచ్చుచున్నది. మనవారు గ్రంథములయందుఁ జెప్పిన ట్లొక్కపామరులే కాక పండితులు సహితము మనదేశములో నిప్పుడు సర్వసాధారణముగా ప్రతిమలను సేవించుచున్నారు. అన్యదేశములయందున్న పామరులకు సహితము మానసికారాధనము పనికివచ్చి వారికి దానివలన నాత్మశాంతి మొదలయిన సమస్త ప్రయోజనములును గలిగి వారు తరించుచుండఁగా, ఒక్కమనదేశమందు మాత్రము పండిత పామర సామాన్యముగా నెల్లవారికిని మానసికారాధన మేల పనికిరాదో, విగ్రహార్చనమే యేల కావలెనో, నా కూహింప శక్యము కాకున్నది. ఇతర దేశములలోని పామరులకన్నను మన దేశములోని పండితులు గ్రహణాదిశక్తులయందు తక్కువవారనియు, అందుచేత నాధ్యాత్మికారాధనమున నర్హులనియు, విశ్వసించుటకును నామన స్సొప్పకున్నది. ఇతర విషయములయందు మనలోని పామరులు కొందఱు విగ్రహారాధన లేనిజాతులవారిలోని పామరులకంటె జ్ఞానాధికులై యుండుటయు, మరికొందఱు వారికంటె జ్ఞానహీనులుగా నుండకుండుటయు, మనము స్వానుభవమువలన నెఱిఁగియున్నాము. కాఁబట్టి దీనికంతకు కొంతకాలమునుండి మన దేశములో నంధపరంపరగా వచ్చుచున్న దురాచారము తప్ప వేఱుకారణము నా కగపడదు. చక్కగా బోధ చేయు గురువు లున్నపక్షమున నిరాకార నిర్వికారుఁ డయిన యీశ్వరుని కళ్యాణగుణములను తెలిసికొని మనస్సులో నామహామహుని

ధ్యానింపలేనంత మూఢు డేదేశమునందును ఏజాతియందును కేవల
చిత్తోన్మాదము గలవాఁడు తప్ప మఱియొకఁ డుండఁ డని నానిశ్చి
తాభిప్రాయము. లోకానుభవము నాయభిప్రాయమును సిద్ధాంతీక
రించుచున్నది. అది గాక మూఢులకు సహితము విగ్రహముల
మూలమున నీశ్వరవిషయకజ్ఞానమును కలిగింపఁబూనుటకంటె సృష్టి
కార్యములనుబట్టి యీశ్వర స్వభావాదులను తెలుపుటయే సహస్ర
గుణముల సులభ మని నామనస్సునకు తోఁచుచున్నది. పగలును,
రాత్రియు, భూమిమీఁదను, ఆకాశముమీఁదను, సమస్త ప్రదేశ
ములయందును, విరామము లేక సృష్టికర్తయొక్క దివ్యమహిమలను
చాటుచుండు దేదీప్యమానములయిన సూర్యుని, చంద్రుని, వివిధ
సుందరరూపములు గల వృక్ష లతాదులను, విచిత్రవర్ణములుగల
పాదరసపుబుడ్లవలె ప్రేలుచు నేత్రోత్సవముచేయు నక్షత్రములను
జూపి, వానిని సృజించి నడిపించుచున్న సర్వశక్తిగల పరమేశ్వరుని
దివ్యలక్షణములను మనసునఁ బట్టించుటే సులభమో, కదలమెదల
నేరని నిర్జీవము లయిన రాతి ప్రతిమలను జూపి యీశ్వరగుణాదు
లను బోధించుట సులభమో, ఊహించుకొనుట కిచ్చటి బుద్ధిమంతు
లకే విడిచిపెట్టెదను. సర్వశక్తిసంపన్నమయి, జ్ఞానస్వరూపమయిన
యగోచరపదార్థమును బోధించుటకయి ప్రత్యక్షముగా కనఁబడు
చుండు జడమయి మొద్దులాగుననుండు దారుమయవిగ్రహము నొక
దానిని జూపి యది దీనివలె నుండునని చెప్పి యెంతబుద్ధిహీనుని
నైనను నమ్మించుట సాధ్యమగునా? సర్వవ్యాపియయి సర్వజ్ఞుఁడయి
యింద్రియాగోచరుఁ డయిన యీశ్వరుఁడు మనప్రార్థన లాలించి
మన యభీప్సితముల నిచ్చునని విశ్వసించుటకంటె, కొండలనుండి తెచ్చి
కాలుచేతులు చెక్కి గుడులలో పెట్టిన రాతివిగ్రహములు మనప్రార్థ

నలు విని మన వాంఛితముల నిచ్చునని విశ్వసించుట సులభమా? మన కగపడకున్న యీశ్వరుఁడు సర్వజ్ఞుఁ డనుటకన్న రాగిప్రతిమ సర్వజ్ఞుఁ డనుకొనుట కష్టతరముకాదా? యీసంగతి యటుండనిండు.

విగ్రహారాధనము స్థాపించిన మనవారు సహితము ప్రతిమారాధనము మౌఢ్యబోధక మనియు, మానసికారాధనము జ్ఞానబోధక మనియునేకదా చెప్పుచున్నారు. లోకములో మౌఢ్యప్రధాన మయిన దెప్పుడును అసత్యముగాను, జ్ఞానప్రధానమయిన దెప్పుడును సత్యముగాను ఉండును. లోకములో నొకయక్రమము మనుష్యుని మఱియొక యక్రమమున కీడ్చును గాని యెప్పుడును క్రమమార్గమునకు దారి చూపదు. అసత్యమువలన నెప్పుడును సత్యము కలుగనేరదు. కాఁబట్టి యజ్ఞానజనక మయిన విగ్రహారాధనమువలన క్రమక్రమముగా జ్ఞానోదయముకలిగి కాలాంతరమున మానసికారాధనమునకు మార్గ మేర్పడునని యెవ్వ రెంత చెప్పినను అట్టిస్థితి యెప్పుడును పొసఁగనేరదని మనము లోకానుభవమువలనను వస్తుతత్త్వమువలనను స్పష్టముగా నెఱుఁగుదుము. మౌఢ్యజన్య మయిన ప్రతిమార్చనము మఱింత మౌఢ్యమునే వృద్ధిపొందించి జనుల నంతకంతకు పరమేశ్వరునినుండి మఱింతదూరముగానే తొలఁగించుచుండును. మనదేశమందించుమించుగా రెండువేల సంవత్సరములనుండి విగ్రహారాధనమును జనులంతకంతకు భగవన్మహిమలను దెలిసి జ్ఞానాధికులు కాక యంతకంతకు భగవంతుని మఱచి జ్ఞానహీనులయి చెడుచుండుట ప్రత్యక్షదృష్టము. పూర్వ మొక్క మూఢులనిమిత్తమే ప్రతిమార్చనము కల్పింపఁబడినను, రాఁగారాఁగా నించుమించుగా నిప్పుడు హిందువు లందఱును విగ్రహారాధకులే యయిపోయినారుకదా? ఒక యక్రమము మఱియొక యక్రమమునకు దింపక మానదు. సూర్యాగ్ని

సముద్రాది మహోత్కృష్టపదార్థములమూలమున భగవన్మహిమలను
దెలిసికొని యారాధించినమనవారు కొంతకాలమునకీశ్వరునెట్లో మఱచి
సూర్యాదులనేకొలుచువారయినారు. ఏకేశ్వరుని విడిచినతోడనేబహు
దైవతములను గొలువనారంభించి, మనవారంతకంతకా దేవతలసంఖ్య
నధికపఱచుచు వచ్చి ముప్పదిమూడుకోట్ల దేవతలను కల్పించి, తుదకు
కొలిచెడు జనుల సంఖ్యకంటె కొలువఁబడు దేవతలసంఖ్యనేయెక్కువ
చేసినారు. మనవా రంతటితోను తృప్తినొందక గృహదేవతలతోను
కులదేవతలతోను స్థలదేవతలతోను గ్రామదేవతలతోను కూడ
మన దేశమునంతను నింపివేసినారు. ఈశ్వరుని మొదట మనుష్య
రూపమునకు దింపిన మనవారు, కాలక్రమమున దేవుని మృగరూప
మునను పక్షిరూపమునను క్రిమికీటకరూపమునను కడపట జడ
రూపముననుకూడఁ గల్పించి కొలువ పాలుపడినారు. ఇంతకు
వచ్చినవా రెంతకురారు? అటుతరువాత ప్రత్యక్ష మృగాదులనే
కొలువసాగినారు. మన దేశములో వృషభములను గొలుచు
వా రెంద ఱున్నారు కారు? గరుడాది పక్షులను సేవించు వా
రెంద ఱున్నారుకారు? పాములను పూజించు వా రెంద ఱున్నారు
కారు? జెఱ్ఱులకు మ్రొక్కువా రెందఱున్నారుకారు? అశ్వత్థాదివృక్ష
ములకు ప్రదక్షిణ నమస్కారములు చేయువా రెంద ఱున్నారుకారు?
తుదకు సన్నికండ్లకును గోడలకును బొట్టు పెట్టి పూజచేయువా రెంద
ఱున్నారుకారు? జను లింతకన్నను మూఢు లగుట యెన్నఁడయిన సా
ధ్యమగునా? మనదేశమున కింతకన్నను దుస్థితి మఱియేమి
పట్టును? సర్వోత్కృష్టుఁ డయిన భగవంతుని నిర్మలమయిన మానసి
కారాధనమును విడిచి తప్పుత్రోవ త్రొక్క మొదలు పెట్టినతరువాత
మనకంటెను పరమ నికృష్టములయిన పశుపక్ష్యాదులకును జడపదార్థ

ములకును దాసులముగాక మన ముత్కృష్టదశ నెట్లు పొందుదుము? దేవుని నీప్రకారముగా పశుపక్ష్యాది రూపములకుం దీసికొనివచ్చుట చేత మనబుద్ధిలోపమే వెల్లడియయి మనమే చెడిపోదుముగాని పరిశుద్ధుం డయిన యాపరమేశ్వరునికి గోరంతయు కొఱంత రాంబోదు. మానసికారాధనము విడుచుటవలనం గలిగిన చెడుగు లింతే కావు. మనము జ్ఞానానందమయుం డయిన యీశ్వరుని మాని జడపదార్థములను కొలుచునంతటి బుద్ధిమంతుల మయినతరువాత మన యారాధన క్రమమును మనబుద్ధికి తగినట్టే యుండును. ఈశ్వరుని హృదయపూర్వకముగా ప్రేమించుటకును త్రికరణశుద్ధి యయిన భగవదాజ్ఞానుసరణమునకును మాఱుగా, మన భక్తియంతయు విగ్రహములకు స్నానములు చేయించుటతోను బట్టలు కట్టుటతోను నగ లలంకరించుటతోను ధూపదీపనైవేద్యాదు లర్పించుటతోను భోగములు చేయించుటతోను ప్రతిసంవత్సరమును వివాహములు చేయుటతోను రథోత్సవములతోను సమాప్తి నొందినది. అంతటితో సరిపోయినను కొంత మేలుగానేయుండును. కొందఱు విగ్రహముల ప్రీతికయి భుజములను కాల్చుకొనుచున్నారు; కొందఱు భుజములయందును నాలుకయందును శూలములు గ్రుచ్చుకొనుచున్నారు ; కొందఱు వీపులకు గాలములు గ్రుచ్చుకొని సిడులాడ లోనగుచున్నారు ; కొంద ఱుపవాసములు చేసి శరీరములు శోషిల్లం జేయుచున్నారు; కొందఱు కోడిపిట్టలను మేకపోతులను తుదకు దున్నపోతులను కూడ రాతిదేవతలకు బలియిచ్చి జీవహింస చేయుచున్నారు. దొరతనమువారు మాన్పంబట్టి కాని లేకపోయినయెడల తమ తోడిమానవులను తమకడుపున బుట్టిన బిడ్డలను కూడ కొందఱు తాముకొలుచువిగ్రహములవలెనే తామును రాతిగుండెనే కలవారయి ప్రతిమలకు బలియియ్య వెనుకతీయకపోవు

టమే కాక. మొండిచేతులజగన్నాథస్వామివారి రథచక్రముల క్రింద పడి యాత్మహత్యలు చేసికొనుటకును తెగించుచున్నారు. మనుష్యుడింతకంటెను క్రూరకృత్యములు మఱియేమి చేయఁగలుగును? ఈ ప్రకారముగా జనులు మానుష స్వభావమును మఱచి ప్రత్యక్షరాక్షసులు కాఁగలుగుట విగ్రహారాధన ప్రభావముచేతనేకదా? ప్రతిమార్చనమువలన నిట్లు మానుషస్వభావమే చెడినప్పుడు నీతిచెడుట యొక వింతకాదు. "యథాదేవ స్తథా భక్తాః" అను న్యాయము మనవారెఱుఁగనిదికాదు. మనము కొలుచుదేవతలనీతి యెట్లుండునో, మననీతియు నట్లే యుండును. అందుకు నిదర్శనము చూడుఁడు. శ్రీకృష్ణవిగ్రహమును గొలుచువారు కృష్ణలీలలనిపాడెడు పాటలు విన్న పక్షమున వివేకులు సిగ్గుచేత తలలు వంచుకొనవలసియుండును; వైష్ణవులలో నాచరింపఁబడు కంచుకోత్సవము, రాసక్రీడ, వల్లభమత సంప్రదాయము, తలచుకొన్నంత మాత్రముచేత మానవజాతి యింత నీతిమాలిన దగునాయని శరీరము పులకించుచున్నది. మగనాండ్ర రవికల నెల్లను చీఁకటిగదిలో వేసి యేపురుషున కెవతె రవిక దొరకునో వాఁడు దానితో వావివరుసలు లేక పరకాంత యనక సంభోగించుట పశుకృత్యముకాక మఱి యేమగును? ఇదేనా రాధామాధవ మతము? ఇదేనా కంచుకోత్సవము? ఓ మతమా! నీ పేరున కెంత యవమానము వచ్చినది! ఇట్టిది మతమని చెప్పుకొనుట సిగ్గులచేటు కదా? పశ్చిమ హిందూస్థానమున వల్లభమతాచార్యుని శ్రీకృష్ణమూర్తినిగా భావించి మానాభిమానములు విడిచి తల్లులు తమ కూఁతులను, అన్నలు చెల్లెండ్రను, అత్తలు కోడండ్రను, భర్తలు భార్యలను, వెంటఁబెట్టుకొనిపోయి పట్టపగలు పలువురు చూచుచుండఁగా దక్షిణలిచ్చి సంభోగార్థ మర్పించి, పుణ్యముపేరు చెప్పి వారిని నీతికిని పాతి

ప్రత్యమునకును మృత్యుదేవతయయిన యాగురువు శయనగృహము నకు పంపుట మతమగునా ? పశుకృత్యమగునా ? మతముపేరు చెప్పి చైతన్యశిష్యులగు వైష్ణవులు కొందఱు తప్పత్రాగి సిగ్గులు లేక గుంపులుకూడి వీథులలో వికారముగా వడఁకురోగము వచ్చినవారివలె తల లెగరవైచుచు గంతులువైచునప్పుడు చూచువారికి మానవజాతి యింత మృగప్రాయమగునా యని యాశ్చర్యము కలుగకపోదు. విగ్రహారాధనము మనుష్యుల నీతిని చెఱచినదన్నందుల కీరెండు మూఁడు నిదర్శనములే చాలును. దివ్యస్థలములను తఱుచుగా సేవించినవారు కొన్ని దివ్యక్షేత్రము లెట్లు వ్యభిచారమునకును త్రాగుఁబోతుతనమునకును జన్మాలయములయి యున్నవో యెఱిఁగి యుండవచ్చును. కాఁబట్టి యిక్కడ నింతకంటె నధికముగాఁ జెప్పుట యనావశ్యకము.

ఈశ్వరుఁడు రూపములేనివాఁడు, గనుక ఆతని ప్రతిరూపముండుటయే సంభవింపదు. కాఁబట్టి విగ్రహము లెప్పుడును తా మీశ్వర రూపదృశ్యమును పొందఁ జాలవు. ఒకవేళ నీశ్వరునకు రూపమున్నదనియు, విగ్రహము లారూపమును తెలుపుననియు వాదసౌకర్యార్థముగా క్షణకాల మంగీకరించినను మన కాతని రూపముతో లేశమయినను ప్రయోజనము లేదు. దేవుఁడు నల్లనివాఁడయినను, తెల్లనివాఁడయినను, పర్వతమంతవాఁడయినను, పరమాణువంతవాఁడయినను, మన కందువలన వచ్చెడిలాభ మేదియు లేదు. నిష్కళంకములయిన యాతని దివ్యగుణముల కద్భుతామోదముల నొంది, సాధ్య మయినంతవఱ కాగుణముల నవలంబించి ఆయనయాజ్ఞానుసారముగా ప్రవర్తింపఁ గలుగుటకయి భగవంతుని కళ్యాణగుణస్వభావాదులనే మనము తెలిసికోవలసి యుండును.

మనము విగ్రహములవంక వేయిసంవత్సరములు ఱెప్పవాల్చక చూచినను భగవంతునియొక్క బుద్ధిగాని, సామర్థ్యముగాని, జ్ఞానముగాని కరుణాళుత్వముగాని, పరిశుద్ధతగాని, మఱి యేకళ్యాణగుణముగాని, యించుకైన బోధపడునా? మన మొక మనుష్యునిప్రతిమను చూచినంతమాత్రముచేత, అతఁ డెంతటి శక్తియుక్తుఁడో, అతనియందు సుగుణసంపద యున్నదో లేదో, కొంచెమయినను గ్రహింపఁ గలుగుదుమా? సాకారమయినజడపదార్థదర్శనమువలన నిరాకార మయి విరుద్ధధర్మముగల జ్ఞానవస్తువివేక మెన్నటికిని కలుగనేరదు. జడాత్మకములయి నవిగ్రహసాహాయ్యమున నేత్రేంద్రియముచేత మానసైకవేద్యమయిన పరమాత్మనే తెలిసికొనుట సాధ్యమయ్యెనేని, అప్పుడు చీఁకటిని చూచుటచేత వెలుతు రిట్టి దనియు విషమును చవిచూచుటచేత చక్కెరయొక్క మాధుర్య మిట్టి దనియు తెలిసికొనుటకూడ సాధ్య మగును. కాఁబట్టి సత్యజ్ఞానానందస్వరూపుఁడయిన యీశ్వరుని ఒక్క మనస్సుచేతనేగాని మఱి యేయింద్రియముచేతను గ్రహించి యారాధించుటకు శక్యము కాదు. దేవుని మనము కన్నులతోఁజూచి చేతులతోఁ బూజింపఁ దలఁచుకొన్నపక్షమున మనలనుజేసిన దేవుని విడిచి మనము చేసినజడములయినవిగ్రహముల నర్చింపవలసినవారమయి యాప్రతిమలకంటెను జడుల మగుదుము. అప్పుడు మూఢభక్తి ముదిరి వివేకము చెడి, దురభిమానము హెచ్చి, బహుదైవతము లేర్పడి, మతద్వేషము పుట్టి, రాగద్వేషాదులు ప్రబలి, మానవధర్మము లయిన దయాసత్యశౌచాదులయందు విపరీతజ్ఞానము గలిగి మనము సర్వవిధముల చెడిపోదుము. విగ్రహారాధనమువలనఁ గలిగినవిపరీతజ్ఞానమాహాత్మ్యమువలననేకదా వైష్ణవులు శైవునిమొగము చూచిన పాపము వచ్చి తమ్ము చుట్టుకొను ననియు శైవులు వైష్ణవునిముఖదర్శనమాత్ర

ముననే ఘోరపాతకము సంభవించునని యుపరస్పరము దూషించుచు ద్వేషించుచు మానుషస్వభావమును మఱచి ముక్తికి తులసిపూసల తావళములును ధుండ్డునామములుమాత్రమే సాధనములని యొకరును రుద్రాక్షమాలలును విభూతిపెండెకట్లురుమాత్రమే సాధనము లని మఱియొకరును పోరాడుచున్నారు! ఈవిగ్రహములభాగ్యమువలననే కదా తమకు పనిచేయు బ్రతికియున్న యెడ్లను తిన్నగా మేఁత పెట్టకయు త్రాగ నీరుపోయకయు తోకలు మెలిపెట్టియు ములుకోలకఱ్ఱలతో పొడిచి తుంట్లు పుండుచేసియు మోయరానిబరువులు మోపి చావ మోదియు బాధించుభక్తాగ్రేసరులు రాతితో చేసినవృషభము కంట బడఁగానే కాలిజోడు వదలి చేతులు జోడించుకొని మ్రొక్కి ఫలములు సమర్పించి పూజించుచున్నారు! ఈవిగ్రహసంపదచేతనేకదా తమ తోడి పేదమానవులు నిలువ నీడలేక నిరంతరకష్టములపాలయి భార్యాపుత్రాదులతోఁగూడ బాధపడుచుండఁగా చూచి వారి కొక్క చిన్న కుటీరమునయినను కట్టించి యిచ్చునంతటికనికరము పుట్టనిభూత దయాళురు తాము కట్టించి యిచ్చినంగాని యీశ్వరున కేమో నిలువ నీడలేకపోవు నన్నట్టుగా వేలకొలఁదిరూప్యములు వెచ్చించి క్రొత్తగా మలిపించిన రాతిదేవతలు కాపుర ముండుట కయి గుడులను గోపురములను కట్టించుచున్నారు! ఈపశుపక్ష్యాదిరూపములనున్న విగ్రహముల నారాధించు పెన్నిధానమబ్బుటచేతనేకదా భగవత్కుటుంబ మయినయీలోకమునఁ తమకు సోదరులుగా జనించి మందభాగ్యులై యున్న తోడిమానవు లంగవైకల్యాదులచేతను దీర్ఘవ్యాధులచేతను దిక్కుమాలి బాధపడుచుండఁగా చూచి యొక్కపూట యింతగంజి పోయలేని ధర్మస్వరూపులైనపుణ్యాత్ములు బియ్యమొడికట్టుకొని వెదకుకొనుచుఁబోయి చీమలపుట్టలకడ పోయుచు, చేపలను మాంస

మును గొని చెట్లవెంబడిని గుట్టలవెంబడిని పరుగులెత్తి తలలు పయి కెత్తి గరుడపక్షులను పిలిచి మాంసాదుల నెగరవేయుచు, సార్థక దానములను చేయుచున్నారు! విగ్రహారాధనమువలనఁ గలుగుచున్న విషతుల్యములయిన దుష్ఫలితము లింతకంటెను మఱియేమికావలెను?

మనవారు జడములయిన విగ్రహముల నారాధించుచుండలే దనియు గుఱి కుదిరి మనస్సు చలింపక యొకదానిమీఁద నిలుచుట నిమిత్తమయి విగ్రహముల నెదుర నుంచుకొని యీశ్వరునే యారా ధించుచున్నారనియు, విగ్రహార్చనము భగవదారాధనమునకు సహాయ పడి క్రమక్రమముగా మానసికారాధనమును పురికొల్పు ననియు చెప్పుదురు. మన మనస్సెప్పుడును స్వభావముచేత నొక్క వస్తువుమీఁద నేకాని యేకకాలమునందు విరుద్ధగుణములుగల యనేకవస్తువులయందు నిలువదు. ఈశ్వరునకును మనకును మధ్య మఱియొకవస్తు వుండిన పక్షమున, మనధ్యానము భగవంతునినుండి తొలఁగి బహుతరముగా నడుమనున్నప్రతిమలమీఁదనే మనలక్ష్యము నిలుచును. కావలసిన యీశ్వరునియందు నిలువక విగ్రహములయందు గుఱి కుదురుటవలన నేమి ప్రయోజనము కలుగును? ఆరంభదశయం దెట్లున్నను క్రమ క్రమముగా విగ్రహములే పూజకు విషయములుకాక మానవు. అటు పిమ్మట నిగ్రహానుగ్రహసామర్థ్యములును పరమాద్భుతమహిమలును కూడ విగ్రహములకే యారోపింపఁబడి, జను లవియే యాపదలను తొలఁగించు ననియు కోరికల నిచ్చు ననియు నమ్ముచుందురు. అందు చేతనేసామాన్యముగా జనులు కొన్నివిగ్రహముల కెక్కువమహత్త్వ మున్న దని భ్రమించి తమయూర నున్నవిగ్రహములను విడనాడి దేవతాసందర్శనము నిమిత్తమయి సకలశ్రమలును పడి దూరదేశ యాత్రలు చేయుచుందురు. అదిగాక యొక్క దేవత నారాధించువారే

మాయూరిదేవత యెక్కువని మావీధిదేవత యెక్కువని దురాగ్రహముతో పోరాడి వ్యర్థవైగములను పరస్పరద్వేషమును పూని యైకమత్యమును చెడఁగొట్టుకొందురు. ఒకవేళ కొందఱిదృష్టియందీశ్వరుఁడు బొత్తిగా పోక కొంతవఱ కున్నను, అతఁడు స్వాభావిక స్వచ్ఛగుణములతో మాత్రము కనఁబడఁడు. మనము చూడఁదలఁచు కొన్నవస్తువునకును కంటికిని నడుమ దేనినైనను పెట్టుకొని చూచిన పక్షమున, చూడఁదలఁచిన వస్తువు కనఁబడినను వికారరూపముతో కనఁబడునుగాని స్వచ్ఛముగా కనఁబడ దనుట యెల్లవారికి ననుభవసిద్ధమే. అదే ప్రకారముగా మన మారాధింపవలసినయీశ్వరునికిని మనకును మధ్య విగ్రహము లడ్డముండునేని భగవద్గుణాదులు మనకు విపరీతరూపముతో పొడకట్టును. అందుచేతనే విగ్రహారాధకులు తమ దేవునియందు జారత్వచోరత్వాదులు సహిత మారోపించి, తమగీతములయం దట్టియపవిత్రవిషయములను కళ్యాణగుణము లని చొప్పించి భక్తిపరవశు లయి పాడుచు, ఆహేయగుణములు తమమనస్సుల కసహ్యములు కాకపోవుటవలన తామును వానిని సులభముగా పొందికలతో నైనను పాపవిచారము లేక యుందురు. మనుష్యనిర్మితము లయినవిగ్రహములనే నమ్మి కొలుచువారికి చూచుటవలనను, ధ్యానించుట వలనను, పూజించుటవలనను, భగవద్గుణానుభవము కాని సత్యమయినజ్ఞానముకాని నిజమయినప్రేమకాని కలుగనేర దని యీవఱకే చూపి యున్నాను. అదిగాక యింద్రియగోచరము లగుపదార్థములను గొలుచుట యింద్రియసుఖములకే యాశపడునట్లు చేసి, ఆధ్యాత్మిక సుఖములను మఱపించి, నీతిని మన్నింపకుండునట్లును జేయును. కాఁబట్టి విగ్రహారాధకులకు కలిగెడి సుఖమంతయు విగ్రహముల నలంకరించుటవలనను, వానికి ధూపదీపనైవేద్యాలు సమర్పించుటవలనను,

ప్రసాదము భుజించుటవలనను, పాటలు వినుటవలనను, ఇంద్రియముల ద్వారమున వచ్చినదేకాని మానసికారాధకులకు కలిగెడి మహత్తరమయిన యాత్మానందము వారికి లేదు. బొమ్మలకు సొమ్ములు పెట్టి బట్టలు కట్టి, గుజ్జెనకూండ్లు వండి, బొమ్మలపెండ్లిండ్లు చేసి, బొమ్మలతో నాడుకొను జ్ఞానమురాని పసిబిడ్డలకు కలుగు సంతోషమువలెనే బాలప్రాయులయిన యావిగ్రహారాధకులకును తమ విగ్రహముల నలంకరించుటయందును, ఉత్సవములు జాతరలు చేయుటయందును ప్రసాదము లారగించుటయందును, పాటలు పాడుటయందును, ఒక విధ మయినయింద్రియసుఖము కలుగునే కాని, పరిశుద్ధభక్తితో మానసికముగా నీశ్వరధ్యానము చేసెడివారి కెల్లయెడలను వ్యక్తమయ్యెడి యీశ్వరుని సర్వశక్తిత్వమువలనను, అపరిమితబుద్ధిసంపదవలనను, అపారకరుణాళుత్వమువలనను హృదయములయందు పొంగి పొరలెడి యీశ్వరవిషయకమయిన యద్భుతప్రేమయు నిరుపమాన కృతజ్ఞతయు, నిశ్చలభక్తియు, అసాధారణగౌరవమును, పరమవిధేయతయు దృఢవిశ్వాసమును, ఉత్తమచిత్తౌన్నత్యమును, అసమాన మానసికానందమును వారి కెట్లు కలుగ నేర్చును? ఆధ్యాత్మికారాధనము లేనివారికి మనోజయ మెట్లు కలుగును? బాహ్యపూజవలన నింద్రియములకు తృప్తి కలుగ వచ్చునుగాని యాత్మశాంతి యెట్లుకలుగును? భగవదారాధనమువలనఁ గలుగవలసిన ఫల మంతయు పరమేశ్వరుని సంపూర్ణగుణానుభవము పొంది, యీశ్వరసాన్నిధ్యముచేత బాహ్యప్రపంచమును మఱచి, ఆపరిశుద్ధుసికళ్యాణగుణముల కానందపరవశత్వము నొంది, ఆపరమదయాళుని నిశ్చలభక్తిపూర్వకముగా ప్రేమించి, సర్వవిషయములయందునుమనోవాక్కాయకర్మలచే నాపరమపితకు ప్రీతికరముగా నడుచుచు, స్వప్రయోజనపరత్వమును రూపు

మాపి, పరోపకారపరాయణత వహించి, ప్రాణములను శరీరములను భగవదాజ్ఞాకైంకర్యాదుల కర్పించుటయయియుండఁగా ఈబ్రహ్మనందను వేయియేండ్లు తలక్రిందైనను విగ్రహారాధకుల కెట్లులభింపనేర్చును ? ఈశ్వరుఁడు మనలను సృజించి పెంచి కాపాడుచున్నందునను, దేహము మొదలుకొని సమస్తము మన కాయన యిచ్చినదే యైనందునను, సమస్తసుఖములను సుఖసాధనములను కల్పించిన వాఁడతఁడే యైనందునను, మన మీశ్వరవిషయమున చెల్లింపవలసిన భక్తికైంకర్యాదులను చెల్లింపక యాగౌరవమున కనర్హము లయిన యన్యపదార్థముల నాతనిస్థానమున కల్పించుకొని సేవించుటయేకదా విగ్రహారాధనము ? అట్టి తప్పుదారివలన నిశ్చలానంద మెన్నటికిని కలుగ నేర దనుట నిశ్చయము. విగ్రహారాధనము లేనికాలములో విద్యచేతను నాగరికతచేతను సర్వజనసమ్మాన్యమై మహోన్నత దశయందుండిన మనదేశము విగ్రహారాధనము వెలసినతరువాతనే యైకమత్యాభావమును పొంది నానాటికి క్షీణించి యన్యాక్రాంతమయి తుద కిప్పటిహీనదశకు వచ్చుటయు, పశ్చిమఖండవాసులు విగ్రహారాధనమును త్యజించి మానసికారాధనము నవలంబించినతరువాతనే తమహీనస్థితిని పోఁగొట్టుకొని దినదినక్రమమున నభివృద్ధి పొంది నాగరికాగ్రగణ్యు లయి యిప్పటి మహోన్నతదశకు వచ్చుటయు, చరిత్రములయందించుకజ్ఞానము కలవారి కందఱికిని కన్నులకు కట్టినట్లుండకపోదు. ఇట్టి సర్వానర్థదాయకమయిన యీవిగ్రహారాధనమువలన నొక్కమతాచార్యులకు తప్ప మఱియెవ్వరికి నేవిధమయిన లాభము లేదు. వారి కిది జీవనాధారముగా నుండుటచేత మతగురువు లెప్పుడును జనులను మూఢులనుగానే యుంచి వారిని వంచించి విత్తమపహరించి కుటుంబపోషణము చేసికొనుటకయి తమచేత నయినన్ని తంత్రములు పన్ని విగ్రహారాధనమును నిలువఁబెట్టుటకే యత్నిం

తురుగాని వారు స్వప్నావస్థయందును స్వలాభకరమైన దీనిని నశింపఁ జేయుట కాలోచింపరు. ఈమతాచార్యులలో విద్యామహిమచేత నిది యయుక్తమని తెలిసియు ధనాశచేత బుద్ధిపూర్వకముగానే పామరులను మోసపుచ్చువారు కొందఱును, చిరకాలాభ్యాసముచేత నిది యుక్తమే యనుకొని నిష్కపటముగానే ప్రోత్సాహపఱుచువారు కొందఱును ఉందురు. ఈయిరుతెగలవారును ప్రతిమార్చనమును నిరుత్సాహపఱుపరు. కాఁబట్టి జనక్షేమమును దేశక్షేమమును కోరు సుజనులు వారిదుర్బలహేతువులను ఖండించి వారి యుక్తులకు తగిన సమాధానములు చెప్పి దేశమునందు మానసికారాధన మెల్ల యెడలను నల్లుకొనునట్లు చేసి పవిత్రమయిన యీశ్వరరాజ్య మెల్ల వారలహృదయములయందును కుటుంబములయందును స్థిరపఱుపఁ బ్రయత్నింపవలయును.

విగ్రహారాధనమును ప్రోత్సాహపఱిచెడిమహానుభావులు భక్తి ప్రధానమనియు, దేనిని నమ్మి కొలిచిన అదే దైవమనియు, విగ్రహములను కొలుచుటవలన బాధకము లేదనియు చెప్పుదురు కాని వారివాక్యములు యుక్తియుక్తము లయినవి కావు. కేవల భావన వలనను, నమ్మకమువలనను ప్రయోజన మేమియు నుండదు. ఒకఁడు తాను రాజు నని నమ్మినంతమాత్రముచేత తాను రాజగునా? దొంగను మంచివాఁ డని భావించిన, వాఁడు పరిశుద్ధుఁ డగునా? అమృత మని నమ్మి విషము త్రాగినయెడల నాలుక యీడ్చుకొనిపోవు నట్లు చేసి ప్రాణోపద్రవము కలుగఁజేయక మన కావిషము దేహ పుష్టిని కలుగఁజేసి యమృతత్వము నిచ్చునా? రజ్జువును సర్ప మను కొన్నచో దానికి ప్రాణము వచ్చి లేచి తిరుగునా? రాతిని తెప్ప యని పట్టుకొన్నయెడల అది నదిని దాటింపఁగలుగునా? ఈప్రకార ముగా పట్టివిశ్వాసము లౌకిక కార్యములయందే పని చేయదని స్పష్ట

ముగా నెఱేఁగి యున్నపుడు పారమార్థికవిషయములలో కార్యకారి యగునని నమ్మటకన్న మూఢత మఱి యేదియు లేదు. మేలు కలుగుట కయి యెప్పుడును సత్యమయిన వస్తువులయందే యర్థావిశ్వాస ముండవలెను. అట్లుగాక భ్రమచేతఁగాని యజ్ఞానముచేతఁగాని యను చితవస్తువులయందు విశ్వాసము పుట్టినయెడల, దానివలన కీడే కలుగునుగాని మేలెన్నటికిని గలుగదు.

ఈశ్వరుఁ డన్నిటియందు నుండునుగాన దేనిని గొలిచినను దోషము లేదని మఱియొక హేతువు చెప్పుదురు. దేవుఁ డంతటను నిండి యుండుటసత్యమే యయినను, సృష్టపదార్థములుమాత్ర మెప్పుడు నీశ్వరస్వరూపములు కావు. అవి యెప్పుడును ఈశ్వరునికంటె భిన్నము లయియే యుండును. వెలుతు రీగదిలో నంతటను నిండియున్నంత మాత్రముచేత గదిలోనిబల్లలు మొదలయిన వన్నియు వెలుతురే యని మతిమంతుఁ డెవ్వఁ డయిన చెప్ప సాహసించునా? ఇందలి యేబల్ల నైనను చీఁకటిలోనికిఁ గొనిపోయిన వెలుతురు కలుగునా? ఉష్ణత మనదేశమునం దంతటను వ్యాపించి యున్నను, ఉష్ణము దేహముకంటె భిన్న మయినదే యందురుగాని యెంత మందబుద్ధు లయినను దేహమంతయుఁగాని దానిలోని యేయవయవ మయినను గాని యుష్ణమని చెప్పఁగలుగుదురా? ఆలాగుననే దేవుఁడు సర్వ వ్యాపియైనను, సృష్టిపదార్థము లన్నియు దేవునికంటె భిన్నము లని స్థూలబుద్ధిసహితము సులభముగా గ్రహింపవచ్చును. కాఁబట్టి యీశ్వ రునికి మాఱుగా దేని నారాధించినను ఆరాధింపవచ్చు ననుట వెఱ్ఱి మాట. సర్వాంతర్యామియైన యాపరమాత్మ నొక్కనినే మాన సికముగా నారాధింప వలయును.

సర్వమును బ్రహ్మమయముగాన దేని నైనను సేవింపవచ్చు నని మఱియొక కారణాభాసమును చెప్పుదురు. సర్వమును బ్రహ్మ

మయినపక్షమున దేనిని కొలువవలసిన యక్కఱయు లేదు. అప్పుడు కొలుచువాఁ డెవ్వఁడు? కొలువఁబడువాఁ డెవ్వఁడు? ఒక్కదానిని కొలువవలెనన్న తోడనే కొలిచెడివాఁ డొకఁడును కొలువఁబడునది యొక్కటియు వేఱుగ నుండి తీఱవలెను. అప్పు డన్నియు బ్రహ్మమున కంటె భిన్నములయి యుండవలెను. అందుచేత సర్వమును బ్రహ్మ మనుట సరిపడదు. ఈశ్వరోపాసకులు సర్వమును బ్రహ్మమే యనుట స్వోక్తివ్యాఘాతము. కాఁబట్టి దేనినైనను కొలువవచ్చు ననువారీ యుక్తిని తలపెట్టనైనను తలపెట్టకూడదు. అద్వైతసిద్ధియై యీశ్వరునిలో నైక్యమయినవా రున్నయెడల వారు తప్ప, ఆస్తికు లందఱును జగత్కర్తను మానసికముగానే ధ్యానించి యానంద మనుభవింపవలెను.

ఈశ్వరజ్ఞానమును కలిగించుటకయి విగ్రహము లక్షరతుల్యము లనియు, ధ్వనులను నేర్పుటకయి వర్ణములు గుఱుతులుగా నేర్పఱుపఁబడినట్టే యివియు నేర్పఱుపఁబడిన వనియు, ఇందొకయుక్తిని చెప్పుచున్నారు. అక్షరాభ్యాసమువలన లోకములో నెల్లవారును విద్య నేర్చి జ్ఞానాధికు లగుచుండఁగా మనము ప్రత్యక్షముగా చూచుచున్నాము. ఆప్రకారముగా విగ్రహారాధమువలన జనులు శుద్ధమయినయీశ్వరజ్ఞానమును పొందుచుండఁగా మన మెక్కడ నైనఁ జూచుచున్నామా? మనదేశములో బహుశతవర్షములనుండి లెక్కలేనిజనులు యావజ్జీవమును విగ్రహారాధనము చేయుచున్నను దేవుని విషయమయి వారి కెక్కువ తెలివి కలుగుచుండఁగా మన మొకప్పుడును చూచుచుండలేదు. గనుక, ముం దటిజ్ఞానము కలుగు ననుటకును మన కాధారలేశము కనఁబడదు. అంతకు విరోధముగా నెల్లదేశములయందును విగ్రహారాధనము జేయువా రెప్పుడును మూఢభక్తులే యయి, కాలక్రమమున మానసికారాధనమునే మూలపట్టించి సర్వ

జనులను విగ్రహారాధకులనుగానే చేయుచుండుటవలన, విగ్రహారాధనము భగవద్విషయకజ్ఞానమునకు సాధకము కాకపోవుటయేకాక బాధకముకూడ నని స్పష్ట మగుచున్నది. కాఁబట్టి విగ్రహములచే నీశ్వరజ్ఞానాభివృద్ధిని కలుగఁజేయుదు మనుట, నిప్పుచే శైత్యము నభివృద్ధి చేయుదు మనుటయే. కాఁబట్టి యీశ్వరజ్ఞానాభివృద్ధికయి సర్వవిధముల ప్రతిమలను దృష్టిపథమునకు దూరము చేయవలెను.

విగ్రహములే లేకపోయినయెడల విద్యావిహీనులగు మూఢుల కీశ్వరజ్ఞానమే నశించు ననియు, అప్పుడు వారికి పాపభయము లేకపోవు ననియు అందుచేత మూఢుల నిమిత్తమయి విగ్రహారాధన ముండవలె ననియు, కడపటియుక్తి నింకొకదానిని చెప్పుదురు. విగ్రహములు రూపము లేని యీశ్వరుని ప్రతిరూపము లగుటయే సాధ్యమయినయెడల నవి యాతని రూపమునే తెలుపును గాని గుణములను తెలుపవనియు, ఈశ్వరారాధనమున కాయన దివ్యగుణములు కావలెను గాని రూపముతో ప్రయోజనము లేదనియు, నేను ముందే చెప్పియున్నాను. కాఁబట్టి విగ్రహములు నిరాకారుఁ డయిన యీశ్వరుని రూపమును తెలుపుటకు సహితము పనికిరావు గనుక సర్వ విధముల చేతను ప్రతిమలు కేవల నిష్ప్రయోజనములు. ఒకఁడు చేసిన విచిత్ర వస్తువులను చూచుటవలన కర్తను చూడకపోయినను కర్తయొక్క బుద్ధికుశలతను, సామర్థ్యమును, మంచితనమును, కొంతవఱకు కనిపెట్టి సంతోషింప వచ్చును. ఆలాగుననే యీశ్వరుని గుణసామర్థ్యాదులను దెలిసికొని యానందించుటకు మనకు మార్గప్రదర్శకము లయిన భగవన్నిర్మితపదార్థములు సర్వత్ర లెక్కకు మిక్కిలిగా నిండియుండి యాయనదివ్యగుణములను దివ్యశక్తులను సహస్రముఖముల ఘోషించుచున్నవి. ఇట్లుండఁగా నెంతటిమూఢునకును భగవంతుని తెలిసికొనుటకయి మూగవిగ్రహములు లావశ్యకము లగునా? ప్రతిమ

లక్కఱ లేకయే మనము చూడని మనుష్యులయొక్క చరిత్రము
లను చదివియు వినియు వారి గుణస్వభావాదులను తెలిసికొనుచుండ
లేదా ? హరిశ్చంద్రునియొక్కగాని ధర్మరాజుయొక్కగాని పటముల
నెప్పుడును చూడకపోయినను వారి సత్య ధర్మ ప్రవర్తనములు విని
గాని చదివిగాని విద్యావిహీనులుసహితము వారిని ప్రేమించి, వారికా
పద వచ్చినదన్నప్పు డాయాపద తమకే వచ్చినట్టు కన్నుల నీరు పెట్టు
కొని పరితపించుచు, వారికి శుభము కలిగిన దన్నప్పుడు తనకు మేలు
కలిగినట్టు సంతోషించుచు నుండలేదా? ఒకరిని ప్రేమించి గౌరవిం
చుటకయి వారిసుగుణసుచరితలు కావలెనుగాని రూప మక్కఱలేదు
గదా? అప్రకారముగానే భగవంతుని దివ్యలక్షణాదులను వివరించెడి
గ్రంథములను చదివిగాని సద్గురుముఖమున వినిగాని యీశ్వరుని తెలిసి
కొని యానందింపలేనంతటి మూఢుఁ డెవఁడుండును? మన కేయుప
కారమును చేయక యెప్పుడో లోకాంతరగతు లయిన గుణసంపన్నుల
చరిత్రములను విన్నంత మాత్రముననే మనకు మనస్సులలో వారి
యం దాదరమును ప్రేమయు కలుగుచుండఁగా, నిత్యమును భగవం
తుఁడు దయచేసిన మితిమీఱినపదార్థముల ననుభవించి సుఖించుచున్న
మన మాయనసృష్టిని విమర్శించుటవలనను దివ్యగుణములను వినుట
వలనను మన కాపరమాత్మునియందు భక్తియు ప్రేమయు కలుగక
పోవునా ? గంభీరమయి యనంతములయిన జంతుజాలములకు నివాస
మయిన మహాసముద్రమును, మనభూమికంటెను సహస్రగుణములు
పెద్దవియు చిన్నవియు నయిన సూర్య చంద్ర నక్షత్రాది గోళకోటు
లను బంతులవలె ధరించినయాకాశమును, వివిధములయినపల్లవములు
పత్రములు పుష్పములు ఫలములు మొదలయినవానితో నిండి
యున్నవృక్షలతాగుల్మాదులచే నావరింపఁబడి యున్నభూమియు, మహా
వృక్షములను వ్రేళ్ళతో పెల్లగింపఁ గలిగిన బలముండియు మెల్లఁగా

పోఁకి దేహములచెమట లార్చి జీతములేని పరిచారకునివలె సేవించుచుండు వాయువును, లోకముల నన్నిటి నొక్కసారిగా దహింపఁగల శక్తి యుండియు నెల్లవస్తువులలో నడఁగి యుండి చలి పాపి, పచనాది కార్యములకు తోడుపడుచుండు నగ్నియు, మనకు భగవన్మహిమలను తెలుపక యీశ్వరజ్ఞానమును పోఁగొట్టి బుద్ధిమాలిన్యము కలుఁగజేయు ప్రతిమలా మన కీశ్వరసద్భావమును మహిమలను భక్తిమార్గమును ఉపదేశించునవి? విరామము లేక యీశ్వరమహిమలను ఘోషించు బాహ్యవస్తువులమాట యటుండఁగా మనప్రయత్న మక్కఱలేకయే మనము నిద్రించుచున్నప్పుడును మేలుకొని యున్నప్పుడును నిరంతరమును మనసుఖాభివృద్ధికయి పనిచేయున్న మనదేహయంత్ర మొక్కటియే మనల నీశ్వరునివంక కాకర్షించు చుండలేదా? మనకద్భుతములయిన జ్ఞానేంద్రియములను దయచేసి బాహ్యప్రపంచములో మన కన్నులను దృప్తిపఱుచుట కయి వివిధసుందరరూపములను, కర్ణములను తృప్తిపఱుచుటకయిబహువిధ శ్రావ్యనాదములను, జిహ్వను తృప్తిపఱుచుట కయి నానావిధ రుచ్యపదార్థములను, ఘ్రాణమును తృప్తి పఱుచుట కయి పలుతెగల సువాసనలను, స్పర్శేంద్రియమును తృప్తిపఱుచుట కయి వివిధమృదుశీతపదార్థములను, కటాక్షించిన దయానిధి యైన యాపరమపితయందు మన మెంత ప్రేమయు విధేయతయు కృతజ్ఞతయు కలవార మయి యుండవలెను! వానచినుకులయినను లెక్క పెట్టవచ్చునుగాని మన కీశ్వరుఁడు ప్రసాదించిన సుఖసాధనముల నెన్నికయిడ శక్య మగునా? ఎంతటిమూఢు లయినను తమకు మేలుచేసినవారియెడ కృతజ్ఞతను ప్రేమను పొందుటకును, ఏలినవారియెడ ప్రభుభక్తిని చూపుటకును, దూరముగానున్నను తమ జనకులను మఱవ కుండుటకును ఎఱిఁగి యుండఁగా, వారు లోకమునందు తా మనుదినమును చూపుచుండెడికృతజ్ఞతను ప్రేమను భక్తిని

పరమోక్షకర్తయు, పరమేశ్వరుఁడును, పరమపితయు నయిన దేవుని యందుకనఁబఱుచుటకు బోధించినను తామెఱుఁగకుందురా ? ఎఱుఁగ కుండరు. కాఁబట్టి తెలిసినవారు సృష్టికర్తయొక్క మహిమలను మూఢుల కుపదేశించి వారిని మానసికారాధనమునకు పురికొల్పుచుండ వలయును.

ఇఁక మన మందఱమును ప్రయత్నము చేసి చిరకాలమునుండి మనదేశమునకు మితిమీఱిన హానినాపాదించుచు మూఢులతోడి పాటుగా పండితులను సహితము భగవంతునినుండి మరలించి తమ యారాధనమునకు దింపి మూఢతుల్యులనుగా జేసిన విగ్రహములను దూరముగా విడిచి, పరమేశ్వరుని దివ్యగుణాదులను తెలిసికొని నిజ మయినశ్రద్ధాభక్తులతో నాకరుణాళుని సేవింతముగాక! ఆకరుణానిధి మూఢులను కూడ ప్రతిమార్చనమునుండి మరలించి శీఘ్రకాలము లోనే తనప్రక్క కాకర్షించుకొనునుగాక! ఓకరుణాకరా! ఓదీన శరణ్యా! నాహృదయ మెప్పుడును నీసేవనుండియు నీయాజ్ఞలనుండియు కొంచెమయినను తొలఁగకుండునట్లు చేసి, లోకుల దాక్షిణ్యము నిమిత్తమును లోకులవలనిభీతిచేతను నే నెప్పుడును ధర్మమార్గమును తొలఁగి చరింపక యెల్లపనులను నీకు ప్రీతికరముగానే చేయుచుండు నట్లు నాకు బుద్ధిని ధైర్యమును ప్రసాదింపుము. స్వార్థపరత్వమును నామనస్సునందు చొరనీయక పరోపకారబుద్ధిని నిలుపుము. నిన్ను సదా తండ్రినిగాను, నీకుటుంబమయిన మానవకోటిని సోదరతుల్యము గాను, భావించి ప్రేమించునట్లు కృపచేయుము.
